ఈనాడు మంచిర్యాల

ఆదివారం అక్టోబరు 6, 2024

కష్టపడి చదివితే.. ఇష్టమైన జీవితం



కలెక్టర్ అభిలాష అభినవ్

కుటుంబ నేపథ్యం	
అమ్మ	కల్యాణి (గృహిణి)
నాన్న	బి.ఎన్.సర్కార్ (విశ్రాంత ఐపీఎస్)
భర్త	రోహిత్ ఝా (బ్యాంకు ఉన్నతోద్యోగి)
స్వస్థలం	పాట్నా సమీపంలోని షోహసరి పట్టణం హబీబ్ పుర(బిహార్)
అభిరుచి	చిత్రలేఖనం
ఆటలు	వాలీబాల్ ఆడటం ఇష్టం

నిర్మల్, న్యూస్‌టుడే : ఇలా చదువు పూర్తికాగానే అలా కొలువు రావాలని అందరూ కోరుకుంటారు. ఒకటి, రెండు ప్రయత్నాలు విఫలమైతే నిరాశ పడతారు. ఇక తమతో కాదులే అని నీరసిస్తారు. కొద్దిపాటి ప్రయత్నంతో ఏదో ఒకటి వచ్చింది చాలులే అని సరిపెట్టుకుంటారు. కానీ చాలా కొద్ది మంది మాత్రమే మొక్కవోని దీక్షతో అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు ప్రయత్నించి విజయం దక్కించుకుంటారు. అందులో ఒకరు నిర్మల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న అభిలాష అభినవ్. కష్టపడి చదివితే ఇష్టమైన జీవితం పొందవచ్చంటున్న స్ఫూర్తిదాయక జీవన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే..

అమ్మ ప్రోత్సాహంతో..

కలెక్టర్‌గా ప్రజలకు సేవ చేయాలని చిన్నప్పటి నుంచి లక్ష్యంగా పెట్టుకున్నా. పోటీ పరీక్షలు రాయడం.. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవడం అలవడింది. ఐఏఎస్ కావడానికి అమ్మా నాన్న ఎంతో ప్రోత్సహించారు. 'కల'గన్న ఐఏఎస్ నెరవేర్చుకున్నందుకు సంతోషంగా ఉన్నా. ఇది ఊరికే రాలేదు. చదువుకునే సమయంలో సరదాలకు దూరంగా ఉండి పుస్తకాలతో కుస్తీ పట్టా. కష్టమనిపించినా ఇష్టపడి చదవడంతో ఈ స్థానంలో ఉన్నా. ఇప్పుడు కలెక్టర్ హోదాలో ప్రజలకు అందిస్తున్న సేవలో ఆనందం కనిపిస్తుంది.

మానసికంగా దృఢంగా..

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఒత్తిడికి లోనుకావొద్దు. నిబద్ధత, క్రమశిక్షణతో చదవాలి. చాలా మంది సివిల్స్ రాసేందుకు ఇష్టమున్నా కష్టమని వెనక్కి తగ్గుతుంటారు. సరైన ప్రణాళికతో ముందుకుసాగితే అనుకున్న లక్ష్యం సాధించవచ్చు. ప్రధానంగా మానసికంగా దృఢంగా ఉండాలి. అపజయాలు ఎదురైనా కుంగిపోవద్దు. చదువుతో భవిష్యత్తు ఉంటుందన్న సంకల్పం బలంగా ఉంటే విజయం వరిస్తుంది.


పాతికేళ్లలోపే లక్ష్యంవైపు..

పాతికేళ్లలోపు కచ్చితంగా లక్ష్యం వైపు అడుగులు పడాలి. ఈ దశలో ఏమి సాధించాలి. ఎటువైపు వెళ్లాలి అనే స్పష్టత ఉండాలి. మీ కల, లక్ష్యం సాధించడానికి వీలైనంత ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలి. ప్రయత్నంలో విఫలమైతే నిరాశ చెందొద్దు. సాధించాలనే సంకల్పం ఉండటం గొప్ప కాదు. దాన్ని అందుకునేవరకు పట్టుదల వీడొద్దు.

ప్రయాణం ఇలా..

- 2012లో బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్) నవీ ముంబైలోని ఏసీ పటేల్ కళాశాలలో పూర్తి చేశా.
- పుణేలోని ఐబీఎంలో రెండున్నరేళ్లు ఉద్యోగం చేశాను. తర్వాత దిల్లీలోని సిండికేట్ బ్యాంకులో మేనేజరుగా పనిచేశా.
- 2014లో తొలిసారి సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి విఫలమైనా నిరాశ చెందకుండా రెండో ప్రయత్నంలో 2016లో పట్టుదలతో చదివి 308 ర్యాంకు సాధించి ఐఆర్ఎస్(ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్)కు ఎంపికయ్యాను.
- నాగ్‌పూర్‌లో ఆదాయ పన్నుశాఖ అధికారిగా తొమ్మిది నెలలు పని చేశాను.
- 2017లో మూడోసారి సివిల్ సర్వీస్ పరీక్షలు రాసి జాతీయస్థాయిలో 18వ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యాను.
- శిక్షణ పూర్తి చేసిన తర్వాత ఆగస్టు 2020లో మొదటిసారిగా మహబూబాబాద్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా, తర్వాత ఖమ్మం అదనపు పాలనాధికారి(స్థానిక సంస్థలు)గా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) జోనల్ కమిషనర్‌గా పనిచేశాను.
- ఇప్పుడు కలెక్టర్ తొలి పోస్టింగ్ నిర్మల్ జిల్లాలో పనిచేయడం సంతోషంగా ఉంది.

అన్నపూర్ణదేవిగా అమ్మ దర్శనం



దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని సూర్యనగర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో శనివారం అమ్మవారి విగ్రహాన్ని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, మంచిర్యాల అర్బన్

అన్నదాత మురిసేట్టు.. అధికారుల కసరత్తు

● సన్నాలకు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: **ఈ వానాకాలం నుంచే సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు పెద్ద మొత్తంలో వీటి సాగుపై దృష్టి సారించారు. గతంతో పోలిస్తే ఈసారి సాగు గణనీయంగా పెరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా.. అక్రమాలకు తావు లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దొడ్డు రకం కేంద్రాలతో పాటు ప్రత్యేకంగా సన్నాలకు విడిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ముందుగా నాట్లు వేసిన చోట వరి పొలాలు గొలక దశలో ఉన్నాయి. ఇవి మరో 20 నుంచి 25 రోజుల్లో కోతకు వచ్చే అవకాశాలున్నాయి. మిగతా చోట్ల ఇప్పుడిప్పుడే పొట్ట దశలో ఉండగా ఇవి నెలన్నర నుంచి 50 రోజుల్లో కోతకు రానున్నాయి..**

రైతులు పండించిన పంటకు మద్దతు అందించేందుకు ప్రభుత్వం వివిధ ఏజన్సీల ద్వారా గతంలో దొడ్డు రకం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో అయినకాడికి వ్యాపారులకే ధాన్యాన్ని అమ్ముకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో సన్నాల సాగు పెరిగింది. బోనస్ ఇస్తుండటం.. సన్న ధాన్యం ఎక్కువ రానుండటంతో ఇందుకు అనుగుణంగా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుపై దృష్టి సారించారు. వచ్చే దిగుబడుల ఆధారంగా కేంద్రాల ఏర్పాటు నిర్ణయాధికారం ప్రభుత్వం కలెక్టర్లకు ఇవ్వడంతో స్థానికగా దిగుబడికి అనుగుణంగా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వచ్చే దిగుబడి అంచనాకు అనుగుణంగా కేంద్రాల ఏర్పాటుపై ప్రతిపాదనలు తయారు చేశారు.



దండేపల్లి శివారులో సాగవుతున్న సన్నరకం వరి

మద్దతు ఇలా...

- ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర 'ఏ' రకానికి రూ.2,320 'బీ' రకానికి రూ. 2300 ధర ఉంది.
- రూ. 500 బోనస్ కలుపుకుంటే 'ఏ' రకానికి రూ. 2820, 'బీ' రకానికి రూ. 2,800 దక్కనుంది.

ఇబ్బందులు లేకుండా చర్యలు

మోతీలాల్, అదనపు పాలనాధికారి, మంచిర్యాల

ప్రభుత్వం సన్నాలకు మద్దతు ధరకు అదనంగా క్వింటాలుకు రూ. 500బోనస్ ప్రకటించినందున రైతులకు ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా సన్నరకం కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దొడ్డు రకాలతో పాటు సన్నరకాల కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు అందేలా చూస్తాం. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

జిల్లాల వారీగా వరి దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

● జిల్లా	● సన్నాలు	● దొడ్డు	● ప్రతిపాదించిన కేంద్రాలు(దొడ్డు, సన్నం కలిపి)
మంచిర్యాల	2,10,000	1,00,000	326
నిర్మల్	85,000	60,000	260
కుమురం భీం	82,000	15000	34
ఆదిలాబాద్	1500	500	03

కాకా సేవలు మరువలేనివి

ఏసీసీ, న్యూస్‌టుడే: ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా గడ్డం వెంకటస్వామి(కాకా) ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం కాకా జయంతిని పురస్కరించుకొని నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో మాట్లాడారు. అదనపు పాలనాధికారి మోతీలాల్, జిల్లా అధికారులతో కలిసి కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదల హృదయాల్లో దీపమై వెలిగిన మహనీయుడు వెంకటస్వామి అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమంతో పాటు సింగరేణి కార్మికుల జీవితాల్లో చెరగని ముద్ర వేశారన్నారు.



వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

పకడ్బందీగా సర్వే చేపట్టాలి

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లాలో చేపడుతున్న కుటుంబ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు సర్వేను పక్కాగా చేపట్టాలని, సర్వే ప్రత్యేకాధికారి కె.ఇలంబరిది ఆదేశించారు. శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఆర్డీవోలు, తహసీల్దార్లు, పుర కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సర్వే జరుగుతున్న తీరుపై చర్చించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే నివేదికను అందించాలని అధికారులకు సూచించారు. సర్వే నిర్వహణపై క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు రాములు, హరికృష్ణ మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి ఇలంబరిది

దసరా తర్వాత బడులకు కొత్త ఉపాధ్యాయులు

ఈ నెల 9న నియామక పత్రాల అందజేత

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించి డీఎస్సీ-2024 ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. జిల్లా కేంద్రంలోని స్థానిక కార్మల్ కాన్వెంట్ స్కూల్‌లో ఈ నెల 1 నుంచి ప్రక్రియను నిర్వహిస్తున్నారు. తొలిరోజు 1:3 ప్రకారం ఎంపికైన జాబితా విడుదల ఆలస్యం నేపథ్యంలో 2వ తేదీ నుంచి పరిశీలనను జిల్లా విద్యాశాఖ అధికారులు చేపట్టారు. ఇందుకోసం 17 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 34 మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, 17 మంది స్కూల్ అసిస్టెంట్లతో పాటు విద్యాశాఖ కార్యాలయ అధికారులు విధుల్లో పాల్గొన్నారు. 288 పోస్టులకు 864 మంది అర్హత సాధించారని భావించినా అధికారులు 721 మందికి పరిశీలన జాబితా విడుదలైనట్లు వెల్లడించారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ ప్రక్రియలో మొత్తంగా 635 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. పలు కారణాలతో మిగతా అభ్యర్థులకు హాజరుకాలేదు.

288 పోస్టుల భర్తీ

కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో 288 పోస్టులతో డీఎస్సీ-2024ను ప్రకటించింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్లు -70, భాషా పండితులు-16, పీఈటీ-3, ఎస్జీటీలు-176, స్పెషల్ ఎడ్యుకేటర్-23 ఉన్నాయి. ఎస్జీటీ పోస్టులు కొంత మేరకు ఎక్కువగానే ఉన్నా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కొన్ని సబ్జెక్టుల్లో కేవలం ఒకటి, రెండు మాత్రమే ఉన్నాయి. వీరికి ఈ ఏడాది జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు

సబ్జెక్టుల వారీగా జిల్లాలో భర్తీ చేసే పోస్టుల వివరాలు

భాషాపండితులు: హిందీ-6, తెలుగు-8, ఉర్దూ-2, పీఈటీ-3, స్కూల్ అసిస్టెంట్: బయోసైన్స్-15, ఇంగ్లీష్-5, హిందీ-6, తెలుగు-16, భౌతిక-2, సాంఘిక శాస్త్రం-26, ఎస్జీటీ: తెలుగు-165, ఉర్దూ-11, స్పెషల్ ఎడ్యుకేషన్-23

9న నియామక పత్రాలు

దసరా సెలవుల నేపథ్యంలో అక్టోబర్ 15న పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ధ్రువపత్రాలను పరిశీలన పూర్తి కావడంతో అర్హులైన వారిని ఎంపిక చేసి ఈ నెల 9న నియామక పత్రాలు అందజేయనున్నారు. సెలవుల తర్వాత బడుల్లో కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరి పాఠాలు బోధించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న చాలా మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు ఎస్ఏలుగా పదోన్నతి పొందడంతో ఆయా చోట్ల ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా ఖాళీల భర్తీ జరుగుతుండడంతో ఉపాధ్యాయుల కొరత చాలా వరకు తీరనుంది. దీనికి తోడు 2008 డీఎస్సీలో ఉద్యోగాలకు అర్హత సాధించి పలు కారణాలతో నష్టపోయిన వారికి ప్రభుత్వం ఒప్పంద పద్ధతిన ఎస్జీటీలుగా నియమించే ప్రక్రియను చేపడుతుండటంతో వీరి నియామకంతో బోధకుల కొరత ఉండదు. మరోవైపు సర్దుబాటు ప్రక్రియ చేపట్టే అవకాశముంది. విద్యావ్యవస్థ గాడినపడనుంది.



మంచిర్యాలలో పరిశీలన కేంద్రం వద్ద డీఎస్సీ 2024 అభ్యర్థులు

దరఖాస్తుల ఆహ్వానం

రామకృష్ణాపూర్: మందమర్రిలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆరు కోర్సుల్లో అడ్మిషన్ల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ దేవానంద్ శనివారం తెలిపారు. ఈ నెల 9 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు.

సాగులో శాస్త్రసాంకేతిక పద్ధతులు అవలంబించాలి

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు పంటల సాగులో మెలకువలతో పాటు అందుబాటులో ఉన్న సాంకేతిక పద్ధతులు వినియోగించేలా అవగాహన కల్పించాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ సత్యనారాయణ అన్నారు. శనివారం బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామంలో జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సాగులో అన్నదాతలు పాటిస్తున్న సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, ఇతర అంశాలను ప్రచారం చేయాలన్నారు. నికర ఆదాయం పెంపునకు సమీకృత వ్యవసాయ పద్ధతులను వివరించాలని సూచించారు. పాడి, చేపలు, పెరటికోళ్ల పెంపకం, జీవాల పెంపకం చేపట్టాలన్నారు. సేంద్రియ పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు సాధ్యమన్నారు. పంటల యాజమాన్యం, వంగడాల ఎంపిక, పంటల మార్పిడి తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. సిరిసిల్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీదేవి, బెల్లంపల్లి కేవీకే శాస్త్రవేత్తలు శివకృష్ణ, తిరుపతి, నాగరాజు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసులుకు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులును శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంచిర్యాల కోర్టు సముదాయంలోని న్యాయమూర్తి ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

వన్యప్రాణులకు రక్ష రేఖ

పర్యావరణ సున్నిత ప్రాంతంగా కవ్వాల్

న్యూస్‌టుడే, జన్నారం: **మంచిర్యాల జిల్లాలోని కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలోని వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. అభయారణ్యంలో ఎకో సెన్సిటివ్ జోన్ (పర్యావరణ సున్నిత ప్రాంతం)ఏర్పాటుగా ప్రకటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జన్నారం, దండేపల్లి మండలాల అధికారులతో సమావేశం నిర్వహించారు. పర్యావరణ చట్టం-1986 ప్రకారం అభయారణ్యంలో పర్యావరణ సున్నిత ప్రాంతంలో ఏర్పాటుతో మూగజీవాలకు తగిన రక్షణ కల్పించవచ్చనే అభిప్రాయానికి వచ్చారు. ఈ మేరకు అటవీ శాఖ అధికారులు ప్రతిపాదనలను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు.**


అడవిలో వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులకు వన్యప్రాణులు కనువిందు చేస్తున్నాయి. ఈ మూగ జీవాలను రక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉంటుంది. వాటికి కావలసిన ఆహారానికి గడ్డి క్షేత్రాలు, తాగునీటికి నీటి కుంటలు, సోలార్ పంపులను అధికారులు అడవి మధ్యలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కవ్వాల్ అభయారణ్యంలోని మూగజీవాలు చింతలేకుండా జీవిస్తున్నాయి. వాటికి ఎలాంటి ఆపద వాటిల్లకుండా ఉండాలంటే ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటు చేయక తప్పదు.

కిలోమీటరు దూరంలోనే వ్యాపారాలు

పర్యావరణ సున్నిత ప్రాంతం ఏర్పాటుచేస్తే ప్రకారం అభయారణ్యానికి ఒక కిలో మీటరు దూరంలోనే నిర్మాణాలు, వ్యాపారాలు నిర్వహించుకోవాలి. ఇసుక రీచ్‌లు, బొగ్గు గనుల తవ్వకాలు, క్వారీల నిర్వహణ వద్ద పేలుళ్లు, కర్మాగారాల ఏర్పాటు, నిర్మాణ రంగ పనులు వంటి ఇతర ఎలాంటి కార్యకలాపాలైనా కిలో మీటరు లోపల చేసేందుకు వీలు లేదు. లేకపోతే అభయారణ్యంలో ఉండే మూగజీవాలకు ఇబ్బంది కలుగుతుంది. అవి భయభ్రాంతులకు గురై అడవిని వీడి మైదాన ప్రాంతాలకు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే గతంలో కవ్వాల్‌లో రెండు ఇసుక రీచ్‌లను మంజూరు చేసినప్పటికీ అప్పటి ఎఫ్‌డీఓ మాధవరావు అభయారణ్యం నిబంధనలను తెలుపుతూ ప్రభుత్వానికి లేఖ రాయడంతో ఆ రీచ్‌లు రద్దు అయ్యాయి. ఆ నిబంధనలను ఉల్లంఘించిన వారికి శిక్షలు సైతం ఉంటాయి.



అభయారణ్యంలో అడవి దున్నలు



కవ్వాల్ అభయారణ్యం

నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు

కవ్వాల్ అభయారణ్యంలోని వన్యప్రాణుల సంరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టనున్నాం. వన్యప్రాణులు అడవిని వీడి బయటకు రాకుండా తగినంత నీరు, ఆహారం అడవిలోనే సమకూర్చాం. ప్రధాన రహదారి వెంట తగిన కంచె నిర్మాణం చేపట్టాం. అటవీ నిబంధనలు, వన్యప్రాణులను వేటాడితే కఠిన శిక్షలు తప్పవు. **శివ్ ఆశిష్‌సింగ్, మంచిర్యాల డీఎఫ్‌వో**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే:

? క్యాతనపల్లి పురపరిధిలోని 3వ వార్డు ఇందిరా నగర్‌లో కాలువలో పూడిక తీయకపోవడంతో మురుగు నీరు నిలుస్తోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

- స్థానికుడు, 3వ వార్డు, క్యాతనపల్లి

✔ సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే చర్యలు చేపడుతాం.

- ప్రదీప్ కుమార్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, క్యాతనపల్లి

నస్పూర్, న్యూస్‌టుడే:

? శ్రీరాంపూర్ ప్రగతి మైదానం లోనికి ప్రవేశించడానికి రెండు ద్వారాలు ఉండగా ఒకటి మూసి వేసి ఉంటుంది. దీంతో మహిళలు మైదానం లోనికి వెళ్లడానికి దూరంగా ఉన్న ద్వారం ద్వారం లోనికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో ద్వారం దూరం ఎక్కువగా ఉండటంతో మైదానం వెళ్ల డానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- కార్మిక కుటుంబాలు, శ్రీరాంపూర్

✔ పరిశీలించి ద్వారం ఓపెన్ చేయిస్తాం.

- శ్రీనివాస్, ఇన్‌ఛార్జి జీఎం, శ్రీరాంపూర్

లీకేజీ పనుల పూర్తి

ఈనాడు స్పందనకు వందనం

జైపూర్, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో 15 రోజులుగా పైపులైను లీకేజీతో కాలనీ వాసులు మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గురువారం 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సమస్య గ్రామ కార్యదర్శి ఉదయ్ దృష్టికి రావడంతో స్పందించారు. లీకేజీలను గుర్తించి పనులు పూర్తి చేశారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో కాంస్య పతకం



వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతితో విద్యార్థిని సహస్ర

జన్నారం, న్యూస్‌టుడే: జన్నారం మండలం ఇంధన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని సహస్ర రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో కాంస్య పతకం సాధించారు. జోనల్‌స్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థిని రాష్ట్రస్థాయిలోనూ చక్కని ప్రతిభ కనబరిచారు. హెచ్‌ఎం రాజేందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు శివునూరి తిరుపతి, ఉపాధ్యాయులు పతకం సాధించిన విద్యార్థినిని అభినందించారు.

ముగ్గురు మహిళా దొంగల అరెస్టు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: వెండి ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వచ్చి వెండి పట్ట గొలుసులను అపహరించుకొని పోయిన ముగ్గురు మహిళలను మంచిర్యాల పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ సీఐ బన్సీలాల్ శనివారం రాత్రి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. భూపాలపల్లి జిల్లా మొగుళపల్లి మండలం ఇస్సిపేట గ్రామానికి చెందిన మాసు అన్నపూర్ణ, రాధ, శనిగరం పూలమ్మలు గతనెల 30న స్థానిక శ్రీ వైష్ణవి జువెల్లర్స్‌లో వెండి ఆభరణాలు కొనుగోలు చేస్తామంటూ వచ్చి 10 జతల వెండి పట్టా గొలుసులను దొంగిలించారు. అదేరోజు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు దుకాణంలో ఉన్న నిఘా నేత్రం ఆధారంగా నిందితులను గుర్తించారు. శనివారం ఎస్సై సనత్, సిబ్బంది బాబాజీ, సుబ్బారావులు ఇస్సిపేటకు వెళ్లి నిందితులను పట్టుకున్నారు. నిందితులు గతంలో బెల్లంపల్లి, జమ్మికుంట, వరంగల్ జిల్లాలోని మట్టెవాడలోని బంగారు దుకాణాల్లో చోరీకి పాల్పడినట్లు సీఐ తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అడవులను, వన్యప్రాణులను సంరక్షించడం అందరూ సామాజిక బాధ్యతగా భావించాలని బెల్లంపల్లి డీఆర్వో సతీష్ అన్నారు. శనివారం బెల్లంపల్లి మండలం పాతబెల్లంపల్లిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. పాతబెల్లంపల్లి బీట్‌అధికారి శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

తాండూరు, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపోటములు సహజమని, స్నేహపూర్వ వాతావరణంలో క్రీడల్లో పాల్గొనాలని సీఐ కుమారస్వామి అన్నారు. శనివారం తాండూరు మండల కేంద్రంలోని క్రీడా స్థలంలో విద్యా భారతి బలగం ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఎస్సైలు కిరణ్‌కుమార్, సౌజన్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు రవీందర్‌రెడ్డి, శంకర్, సురభి ఆగమరావులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

వేంపల్లి, (మంచిర్యాల పట్టణం): హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామంలో శనివారం మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. డేగ బాపు, సంజయ్‌రావు, డేగ రాజేశం, శ్రీనివాస్, సృజన్ పాల్గొన్నారు.

అధికారుల బదిలీ

కొత్తగూడెం సింగరేణి: సింగరేణిలో నలుగురు అధికారులను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గోలేటి ఓసీలో డీవైజీఎంగా పనిచేస్తున్న నాయని ఉమాకాంత్‌ను బెల్లంపల్లి ఏరియా సెక్యూరిటీ అధికారిగా, శ్రీరాంపూర్‌లోని టింబర్‌యార్డులో అదనపు మేనేజర్‌గా పనిచేస్తున్న ఎస్. జక్కారెడ్డిని శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ అధికారిగా, శ్రీరాంపూర్ ఏరియా సెక్యూరిటీ అధికారి సిలివేరి మురళీమోహన్‌ను భూపాలపల్లి ఏరియా సెక్యూరిటీ అధికారిగా, భూపాలపల్లి ఏరియా సెక్యూరిటీ అధికారి టి. రవిని శ్రీరాంపూర్ ఓసీ-2 సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా బదిలీ చేశారు.

దరఖాస్తుకు అవకాశం

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న అంబేడ్కర్ సార్వత్రిక విద్యాలయం డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 15 వరకు అవకాశం ఉన్నట్లు అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల కేంద్రంలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీజెడ్సీ, కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

సెల్లార్లలో అక్రమ దుకాణాలు తొలగించాలి

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాల పట్టణంలో బడా వ్యాపారులు సెల్లార్లలో ఏర్పాటు చేసిన అక్రమ దుకాణాలను అధికారులు తొలగించి వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కలేందర్ అలీ ఖాన్ కోరారు. మంచిర్యాలలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఇటీవల పట్టణంలో రహదారి పక్కన ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలు తొలగించడం.. మాతాశిశు ఆసుపత్రి ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సెల్లార్లలో పార్కింగ్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. పార్టీ నాయకులు చాడ మహేందర్‌రెడ్డి, కోడి వెంకన్న, బియ్యాల రాజేశం, యాదగిరి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు పంచాయతీలకు ముప్పుతిప్పలు

భీమిని, న్యూస్‌టుడే: ఆ మూడు పంచాయతీలు ప్రస్తుతం మంచిర్యాల జిల్లా భీమిని పరిధిలో ఉన్నాయి. కానీ సిర్పూరు శాసనసభ నియోజకవర్గ పరిధిలోకి వస్తారు. అత్యవసర పనులు ఏమీ ఉన్నా పాత మండలానికే వెళ్లాల్సి వస్తోంది. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా ఎర్రవాగు

చిన్నతిమ్మాపూర్, తంగళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న ఎర్రవాగు ప్రమాదకరంగా ఉంది. సెప్టెంబరు 20న వాగు ఉప్పొంగడంతో వ్యవసాయ పనులు ముగించుకొని వస్తూ ఎర్రవాగు దాటే క్రమంలో ట్రాక్టరు, అయిదుగురు రైతు కూలీలు వాగులో చిక్కుకున్నారు. స్థానికుల సహాయంతో ప్రాణాలతో బయటపడ్డారు.



చిన్నగుడిపేట, వడాల గ్రామాల మధ్య అధ్వానంగా రహదారి



ఇటీవల చిన్నతిమ్మాపూర్ ఎర్రవాగులో చిక్కుకున్న ట్రాక్టర్, రైతు కూలీలు

భీమిని మండలం చిన్న తిమ్మాపూర్, చిన్నగుడిపేట, కేస్లాపూర్ గ్రామ పంచాయతీలు మండలాల పునర్విభజనకు ముందు కుమురంభీం జిల్లా సిర్పూరు నియోజకవర్గంలోని దహెగాం మండల పరిధిలో ఉండేవి. పునర్విభజన అనంతరం మంచిర్యాల జిల్లా భీమిని మండలంలో కలిశాయి. దీంతో అత్యవసర సేవలు వైద్యం, విద్యుత్తు సమస్యలు తలెత్తున్నాయి. చిన్నగుడిపేట, చిన్న తిమ్మాపూర్, కేస్లాపూర్ గ్రామపంచాయతీల రోగులు ఇప్పటికీ దహెగాం పీహెచ్‌సీకి వెళ్లాల్సిందే. గర్భిణులు, బాలింతలు, అత్యవసర చికిత్స పొందే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నగుడిపేట, కేస్లాపూర్ రోగులు దహెగాం పీహెచ్‌సీకి వెళ్లాలంటే సుమారు 25 కి.మీ. చుట్టూ తిరిగి వెళ్లాలి.

అధ్వానంగా దారి..

భీమిని మండలం చిన్నగుడిపేట వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు చెప్పుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సుమారు 4 కి.మీ. రహదారి రాళ్లు తేలి, గుంతలు ఏర్పడి వాహనదారుల వెన్నులో వణుకు పుడుతోంది. కేస్లాపూర్ గ్రామంలో పంచాయతీ భవనానికి నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణం మధ్యలోనే ఆగింది.

కాకాకు ఘన నివాళి



చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాకా చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మంచిర్యాలలో..



మందమర్రిలో రక్తదానం చేస్తున్న యువత, పార్టీ శ్రేణులు



కాసిపేటలో..

మంచిర్యాల పట్టణం, శ్రీరాంపూర్ గ్రామీణం, కోటపల్లి, జైపూర్, భీమిని, జన్నారం, వేమనపల్లి, బెల్లంపల్లి పట్టణం, కాసిపేట, తాండూరు, చెన్నూరు పట్టణం, భీమారం, రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ నాయకులు గడ్డం వెంకటస్వామి 95వ జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. వెంకటస్వామి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాల కోసం ఎంతో తోడ్పడ్డారని కొనియాడారు. క్యాతనపల్లిలో నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మందమర్రిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బెల్లంపల్లి పట్టణంలో వంద మంది పేదలకు దుప్పట్లను కాంగ్రెస్ నేతలు అందజేశారు. కార్మికులకు పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టిందే కాకా వెంకటస్వామి అన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 95 కిలోల కేకును కట్ చేశారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు రక్తదానం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

రహదారిని బాగు చేయాలి

కోటపల్లి, న్యూస్‌టుడే: కోటపల్లి మండలం వెంచపల్లి మార్గాన్ని పునరుద్ధరించి ప్రజల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కోటపల్లి మండల భాజపా నాయకులు డిమాండ్ చేశారు. రహదారి పూర్తిగా చెడిపోవడంతో ప్రాణహిత తీరప్రాంత గ్రామాలకు కనీసం అత్యవసర వాహనం కూడా రాలేని పరిస్థితి తలెత్తిందని తెలిపారు. ఆల్‌గామ గ్రామానికి చెందిన అంబాల దుర్గయ్య అనే పశువుల కాపరికి శుక్రవారం ఫిట్స్ వచ్చి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడని సమాచారం అందిస్తే నాలుగు గంటల తర్వాత ఆలస్యంగా అంబులెన్స్ వచ్చిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే వివేక్ స్పందించి రహదారిని బాగుచేయాలని కోరారు. నాయకులు మంత్రి రామయ్య, పెద్దింటి పున్నంచెందు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా ముత్యం బుచ్చన్న

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల నూతన ప్రిన్సిపల్‌గా ముత్యం బుచ్చన్న నియామకమయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఆదర్శ పాఠశాల అదనపు డైరెక్టర్ ఎస్.. శ్రీనివాసచారి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. గత నెలలో జరిగిన ఆదర్శ పాఠశాలల బోధన, బోధనేతర సిబ్బంది బదిలీల్లో ఇక్కడ ప్రిన్సిపల్‌గా పనిచేసిన వి. రజిని బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో ఎం. నాగవర్మ ప్రస్తుతం ఇన్ఛార్జి ప్రిన్సిపల్‌గా కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో మగ్గిడి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ముత్యం బుచ్చన్న మంచిర్యాలకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ కాగా ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు.

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..



కాసిపేట ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థినులు

కాసిపేట, బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బెల్లంపల్లి పట్టణంలోని భవిత డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడి పాడారు. అధ్యాపకులు, విద్యార్థినులు కలిసి బతుకమ్మ పాటలతో నృత్యాలు చేస్తూ అలరించారు. కాసిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.



బతుకమ్మల వద్ద జీఎం దేవేందర్, ఇతర అధికారులు, మహిళా ఉద్యోగులు

రామకృష్ణాపూర్: తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకమైన విశిష్ట వేడుక బతుకమ్మ అని, పూలనే దేవతగా కొలిచే అపురూప పండుగ బతుకమ్మ అని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. శనివారం మందమర్రి జీఎం కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాలను జరుపుకొన్నారు.

పోలీస్ బెటాలియన్‌లో చండీయాగం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: హాజీపూర్ మండలం గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మూడో రోజు శనివారం నిర్వహించిన చండీయాగంలో బెటాలియన్ కమాండెంట్ పి. వెంకట రాములు పాల్గొన్నారు.



గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించిన చండీయాగంలో పాల్గొన్న కమాండెంట్ పి.వెంకటరాములు

8న ఫ్యామిలీ డే వేడుకలు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: సింగరేణి ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో ఈ నెల 8న ఫ్యామిలీ డే ఆటాపాట సంబరాలను నిర్వహిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

శాకంబరి రూపం.. భక్తులకు దర్శనం



చెన్నూరు, న్యూస్‌టుడే: చెన్నూరు పట్టణంలోని మంగళిబజార్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. శాకంబరి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని స్థానిక భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంచాయతీ కార్మికుల ధర్నా

కన్నెపల్లి, న్యూస్‌టుడే: నెన్నెల మండలంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు తమ వేతనాలు చెల్లించాలని శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అయిదు నెలల నుంచి వేతనాలు లేక తీవ్ర ఇబ్బంది అవుతుందని కార్మికులు వాపోయారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు.

ఆర్థిక అక్షరాస్యతతో అభివృద్ధి



నస్పూర్‌లో బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్న మేనేజర్ స్వామి

నస్పూర్, న్యూస్‌టుడే: తెలంగాణ గ్రామీణ బ్యాంకులు అందిస్తున్న సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీతారాంపల్లి శాఖ బ్రాంచ్ మేనేజర్ స్వామి పేర్కొన్నారు. శనివారం రాంనగర్‌లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. పొదుపు పథకాలు, రుణాలు, బీమా పథకాలు, నగదు రహిత లావాదేవీలు జరిగినప్పుడు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తగా పాటించాలో వివరించారు.

కాసిపేట: అక్షరాస్యత సాధిస్తే మహిళలు స్వతహాగా ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులు అన్నారు. మండలంలోని పెద్దనపల్లి నాయికపుగూడెంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

ఒకే చోట సన్నరకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లు

ఏసీసీ, న్యూస్‌టుడే: జిల్లాలో వానాకాలం వరిధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సహకార, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పౌర సరఫరాల శాఖ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. నిబంధనల మేరకు ఆయా కేంద్రాల్లో సన్నరకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు ఒకే చోట వేర్వేరు కేంద్రాలు నిర్వహించాలని సూచించారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. గన్నీ సంచులు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, ప్రతి కేంద్రంలో అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు కల్పన, సంజీవరెడ్డి, కిషన్, బ్రహ్మారావు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుల నడ్డివిరుస్తున్న కేంద్ర ప్రభుత్వం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: నిత్యావసర ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచుతూ సామాన్యుల నడ్డివిరుస్తున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి సీనియర్ నాయకులు చిప్ప నరసయ్య అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మెండి వైఖరికి నిరసగా ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. నిత్యావసర ధరలకు తగ్గించాలని కోరుతూ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని ఆరోపించారు. నియోజకవర్గ కార్యదర్శి వెంకటస్వామి, లక్ష్మినారాయణ, రాజన్న, ఐలయ్య, రామచందర్, పూర్ణిమ, అమృత తదితరులున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: మందమర్రి మండల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో శనివారం చెన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బానోత్ ప్రసాద్ మండల వ్యవసాయ అధికారి కిరణ్మయితో కలిసి తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని ఎరువుల స్టాక్ రికార్డులు, బిల్లు బుక్కులను పరిశీలించారు. ఆధార్ కార్డు ఆధారంగా ఎరువులను విక్రయించాలని సూచించారు. రైతులకు ఎరువులు ఈ పాస్ మిషన్ ద్వారా అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఊరు రామకృష్ణాపూర్ గ్రామ శివారులోని వరి, పత్తి, కంది చేలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

యువతకు ఉపాధి కల్పించండి

భీమిని, న్యూస్‌టుడే: రజకులకు మోడల్ దోబీఘాట్లు ఏర్పాటు చేయాలని జిల్లా అధ్యక్షులు తంగళ్లపల్లి బాపు అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు ఉయ్యాల రాజన్న ఆధ్వర్యంలో సమావేశమై మాట్లాడారు. మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. రజక సంఘం భవనం ఏర్పాటు చేయాలని కోరారు. రజక యువతకు ఉపాధి కల్పించి ఆదుకోవాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు రాగాల రాజన్న, మండల ఉపాధ్యక్షులు ముత్తయ్య, ప్రధాన కార్యదర్శి జనగామ మల్లేష్, కోశాధికారి మాదాసు ప్రశాంత్, సభ్యులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: ఓటు వజ్రాయుధమని, అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని కరీంనగర్‌కు చెందిన వైద్యుడు బీఎన్‌రావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓటు నమోదు అవగాహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక గ్రంథాలయంలో పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను కలిసి ఓటు నమోదు ప్రక్రియను వివరించారు.

ఉత్తమ పతకాలు సాధించడం అభినందనీయం

తాండూర్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ (కుస్తీ) పోటీలో ఇద్దరు విద్యార్థులు కాంస్య పతకాలు సాధించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు, పీడీ సాంబమూర్తి అన్నారు. తాండూరు మండలంలోని అచ్చలపూర్ జిల్లా పరిషత్తు పాఠశాలకు చెందిన శ్రీవల్లి, ఈశ్వరీలు మహబూబ్‌నగర్ జిల్లా దువ్వాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొని కాంస్య పతకం సాధించారు. వారిని ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ అభినందించారు.

ముల్కల్లలో వైద్య శిబిరం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: హాజీపూర్ మండలంలోని ముల్కల్లలో సమగ్ర ఆరోగ్య ప్రచారంలో భాగంగా శనివారం హెచ్ఐవీ, ఎయిడ్స్ పైన అవగాహన కల్పించారు. 31 మందికి రక్త పరీక్షలు చేశారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న, వైద్య సిబ్బంది జయమేరీ, నరేందర్‌రెడ్డి, రాజేందర్, ఆదిలక్ష్మి, స్నేహ పాల్గొన్నారు.

అటవీ అభివృద్ధి సంస్థలో సిబ్బంది భర్తీకి చర్యలు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణలో అటవీ అభివృద్ధి సంస్థ పురోగాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలతో పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్టు ఆ సంస్థ ఛైర్మన్ పొదెం వీరయ్య తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ఎఫ్‌డీసీ స్థలంలో రూ.80 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన డివిజన్ కార్యాలయ భవన సముదాయాన్ని శనివారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. టీజీఎఫ్‌డీసీ లాభాలబాటలో పయనిస్తోందన్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిసర అటవీప్రాంతాల్లో ఎకో టూరిజం ద్వారా టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేయడానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎఫ్‌డీసీలో సిబ్బంది కొరత ఉందని, భర్తీకి సీఎంతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.



లాభాల వాటా పంపిణీపై స్పష్టత

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరేణి కార్మికులకు చెల్లించే లాభాల వాటాపై స్పష్టత వచ్చిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ 2023-24 వార్షిక సంవత్సరానికి సంస్థ సాధించిన లాభాల్లో 33 శాతం వాటా ప్రకటిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొందన్నారు. దానిలో భాగంగా కార్మికులకు చెల్లించే రూ.796 కోట్లలో ఎవరికి ఎంత చెల్లించాలో నిర్ణయం జరిగిందని తెలిపారు. ఉద్యోగుల హాజరుపై 85 శాతం రూ.679కోట్లు, గ్రూపు నైపుణ్యతపై 14 శాతం రూ.111.45కోట్లు చెల్లించనున్నారన్నారు. దీనిలో భాగంగా భూగర్భ గనుల్లో పని చేసే కార్మికుడికి రోజుకు రూ.771.11, ఉపరితలంలో పని చేసే వారికి రోజుకు 610.46, విభాగాల్లో పని చేసే వారికి 563.50 అందనున్నాయని పేర్కొన్నారు. లాభాల వాటా ఈ నెల 7న కార్మికుల ఖాతాలో జమ కానుందని తెలిపారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

కాసిపేట, న్యూస్‌టుడే: తమ సంఘంపై కొందరు కావాలనే అసత్య ప్రచారాలను చేస్తున్నారని, కార్మికులు వారి మాటలను నమ్మొద్దని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. కాసిపేట గని ద్వార సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి ఏటా సైతం స్థూల లాభం నుంచి కాకుండా, నికర లాభం నుంచే కార్మికులకు లాభాల వాటా అమలవుతుందని చెప్పారు. అనంతరం కోల్ ఇండియా స్థాయి ఒడిశాలో నిర్వహించిన పోటీలో కాసిపేట 2 గనికి చెందిన జూనియర్ అసిస్టెంట్ భవ్యశ్రీ పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించిన సందర్భంగా ఆమె ఘనంగా సన్మానించారు.



కాసిపేట-2 వద్ద గని మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య

చోద్యం చూస్తున్న గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: సింగరేణి కార్మికులకు సంస్థ సాధించిన వాస్తవ లాభాల్లో నుంచి 33 శాతం వాటాను చెల్లించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. మందమర్రిలోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి విస్తరణ పేరిట రూ.కోట్లు తీసుకుంటుంటే గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు చోద్యం చూస్తున్నాయన్నారు. మొత్తం లాభాలపై వాటా ఇవ్వాలని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు అడగకపోవడం కార్మిక ద్రోహమని అన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు జె. శ్రీనివాస్, సుదర్శన్ ఉన్నారు.

సంక్షేమ పథకాల అమలులో కృషి

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: మందమర్రి జీఎం కార్యాలయంలో శనివారం మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి(కాకా) జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఏరియా జీఎం దేవేందర్ హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సింగరేణి కార్మికుల అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కాకా కృషి చేశారని అన్నారు.

సంస్థలో పెరిగిన ప్రభుత్వ జోక్యం

నస్పూర్, న్యూస్‌టుడే: సింగరేణిలో ప్రభుత్వ జోక్యం పెరిగిందని ఫలితంగా కార్మికులకు లాభాల వాటా పంపిణీలో అన్యాయం జరిగిందని తెబొగకాసం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం శ్రీరాంపూర్‌లోని ఆర్కే-6 గని ద్వార సమావేశంలో మాట్లాడారు. సింగరేణి లాభం రూ.4701 కోట్లు రాగా 33 శాతం అంటే కార్మికులకు రూ.1551 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం రూ.796 కోట్లు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖని చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. తెబొగకాసం ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, నాయకులు పెట్టం లక్ష్మణ్, బండి రమేష్, పానుగంటి సత్తయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్‌లోని ఆర్కే-6 గనిలో మాట్లాడుతున్న తెబొగకాసం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



కష్టాలను ఎదిరిద్దాం.. కన్నీళ్లను తుడిచేద్దాం

● నవరాత్రుల ప్రబోధమిదే



ఈటీవీ - ఆదిలాబాద్ :

కలకానిది విలువైనది బతుకు. కన్నీటిధారలలోనే బలిచేయకు. అగాధమౌజలనిధి లోన ఆణిముత్యమున్నటులే. శోకాలమరుగునదాగి సుఖమున్నదులే. ఏదీ తనంత తానై నీదరికిరాదు. శోధించి సాధించాలి.. అంటాడు మహాకవి శ్రీశ్రీ. ఆకాశంలో మెరుపు క్షణకాలమే కావచ్చు. ప్రపంచానికి వెలుగునిస్తుంది. విరగకాసిన వృక్షం దెబ్బతగిలినంత మాత్రాన ఫలాలు ఇవ్వటం మరిచిపోదు. జీవితమూ అంతే. చిన్న సమస్యలకే కుంగిపోయి బలవన్మరణాలకు పాల్పడితే ఫలితమేముంటుంది? కష్టాలను ఎదుర్కొంటూ.. కన్నీళ్లను తుడిచేస్తూ ముందుకు సాగితేనే బతుకు సార్థకమవుతుంది. శరన్నవరాత్రులతో పాటు తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరంలోనూ అదే పరమార్థం ఉంది. ఎదిరించి పోరాడాలనే ధీరత్వం ఇమిడి ఉంది. సహజసిద్ధమైన వనరులతో మమేకమై ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆత్మహత్యలు పెరగటం ఆందోళన కలిగిస్తోంది.



● బతుకులోని మాధుర్యాన్ని గుర్తిద్దాం


శరన్నవరాత్రులు - బతుకమ్మ సంబరాలు ధీరత్వానికి ప్రతీకలు. తొమ్మిది అవతరాలను పరిశీలిస్తే చెడుపై విజయం సాధించిన హితం వెల్లడవుతుంది. పరిస్థితుల రీత్యా బాలత్రిపుర సుందరి, గాయత్రి, అన్నపూర్ణ, లలితా త్రిపుర సుందరి, మహాచండీ, మహాలక్ష్మీ, సరస్వతీ, దుర్గా, మహిషాసుర మర్దని, రాజరాజేశ్వరి దేవి అవతారాలతో బతుకులోని గొప్పదనాన్ని వెల్లడిస్తోంది. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకల సారాంశం కష్టాలను దిగమింగి జీవితాన్ని ఆస్వాదించాలని చాటిచెబుతోంది. ఆలోచిస్తే అంతర్లీనంగా కుటుంబ మాధుర్యమేంటో గుర్తుకొస్తుంది. బతుకులోని తీయదనం వెల్లడవుతుంది.

వీరత్వానికి ప్రతీక

జోడేఘాట్ కేంద్రంగా సాగిన కుమురం భీం పోరాటం ధీరత్వానికి ప్రతీక. ఇంద్రవెల్లి వేదికగా సాగిన ఆదివాసీల విముక్తి పోరు మరో జలియన్ వాలాబాగ్‌గా ప్రసిద్ధి పొందింది. ఈ రెండు ఘటనలను పరికించి చూస్తే తమ భావాలను పరస్పరం చర్చలు - పరిష్కార మార్గాలేంటి? అని సమాలోచనలు చేయటమే కాకుండా దండుగా ముందుకు సాగినట్లు చరిత్ర వెల్లడిస్తోంది. ఇప్పుడు దండుగా సాగాల్సిన అవసరం లేదు. సమాజం కోసం కదం తొక్కాల్సిన పని లేదనుకున్నా కనీసం ఎవరి కుటుంబాల గురించి వారు ఆలోచిస్తే ఆత్మహత్య అనే ఆలోచననే రాదు. రైతుల కష్టాలను నెమరేసుకుంటే మనకున్నవి ఇబ్బందులే అని అనిపించవు.



ఆత్మహత్యతో వచ్చేదేమిటి?



అదో ఆనందమైన కుటుంబం. భార్యాపిల్లలతో జీవితం సాఫీగా సాగుతోంది. కొన్ని నిర్ణయాలతో కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. స్నేహితులతో చర్చించలేదు. బంధువులను సంప్రదించలేదు. భార్యాపిల్లలు సహా తాను ఆత్మహత్య చేసుకోవటంతో ఆ కుటుంబ ప్రస్థానమే ముగిసిపోయింది. భావిజీవితం కలిగిన పిల్లల బతుకు బలైంది. బతికున్న కుటుంబ సభ్యుల్లో తీరని దుఃఖాన్ని మిగిల్చింది. అపవాదును తెచ్చిపెట్టింది. కారణాలు వేరైనా ఉమ్మడి జిల్లాలో ఇలాంటివి ఎన్నో చోటుచేసుకోవటం మనసును కలిచివేస్తోంది.

ఏం చేయాలంటే..

ఉమ్మడి జిల్లాలో నిర్మల్, మంచిర్యాల ప్రాంతాల్లో ఆత్మహత్యల ఘటనలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, పౌర సమాజం మేల్కోవాలి. జరగకుండా కార్యాచరణను ప్రకటించాలి. గోదావరి, పెన్‌గంగ, ప్రాణహిత జీవనదులే కాదు. సింగరేణి బొగ్గు, తెల్లబంగారమైన పత్తి సహా సహజసిద్ధమైన ప్రకృతి వనరులున్న ఉమ్మడి జిల్లాలో బతుకుదెరువుకు ఉపయుక్తంగా ఉంటుందని వివరిస్తే బలవన్మరణాలు జరగకుండా చూడొచ్చు.



జిల్లాల వారీగా ఆత్మహత్యల వివరాలు..

జిల్లా	2023	2024
ఆదిలాబాద్	260	193
ఆసిఫాబాద్	156	121
నిర్మల్	437	296
మంచిర్యాల	377	350



రాగిజావా.. ఆరోగ్యానికి రక్ష!

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే కాకుండా ఆరోగ్య రక్షణకు తోడ్పాటు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు మరింత ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో కేంద్రాల్లో రాగి జావా అందిస్తామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రకటించడంతో వారి ఆరోగ్యం మరింత మెరుగుపడే అవకాశం కలగనుంది.

● అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీకి సన్నాహాలు

ఇప్పటికే లబ్ధిదారులకు పోషకాహారం అందిస్తున్నా.. చాలా మంది చిన్నారులు పోషకాహార లోపం నుంచి బయటపడలేకపోతున్నారు. ఎత్తుకు తగ్గ బరువు లేక అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో రాగిజావా రక్త హీనతను తగ్గించి ఎముకలు బలంగా మారడానికి ఎంతో మేలు చేస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 2.50 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఘన రూపం కంటే ద్రవరూప ఆహారంతో త్వరగా జీర్ణం అయి మంచి ఆరోగ్యానికి అవకాశం ఏర్పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

వెంటాడుతున్న పోషకాహార లోపం..

చాలా మంది చిన్నారులు పోషకాహారం సరిగా లేక పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఎత్తుకు తగ్గ బరువు లేక బక్క పలచగా ఉంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 4,124 అంగన్‌వాడీ కేంద్రాల్లో లోప పోషణ ఉన్న పిల్లలు 5,036 కాగా.. తక్కువ బరువు ఉన్న వారు 16,452 మంది వరకు ఉన్నారు.

పీవీటీజీల కోసం ప్రత్యేక పోషకాహారం..

అంగన్‌వాడీ కేంద్రాల్లోని లబ్ధిదారులకు నిత్యం గుడ్లతో భోజనం పెడతారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పీవీటీజీ (పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్)ల్లో చాలా మంది రక్తహీనత, ఎదుగుదల లోపం తదితర అనేక రుగ్మతలతో బాధపడుతున్నారు. వీరికి మరింత బలవర్ధకమైన ఆహారం అందించాలన్న ఉద్దేశంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరి పోషణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 291 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ అనుబంధ ఆహారాన్ని అందిస్తున్నారు. దీనిలో జొన్న గట్క, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలు, హల్వా, పల్లిపట్టి, నువ్వుల పట్టీలను పంపిణీ చేస్తున్నారు.

జిల్లాల వారీగా అంగన్‌వాడీ కేంద్రాలు, నమోదైన లబ్ధిదారులు, పిల్లల ఆరోగ్య పరిస్థితి..

జిల్లా	కేంద్రాల సంఖ్య	0-6 ఏళ్ల పిల్లలు	గర్భిణులు	బాలింతలు	అతి తీవ్ర పోషకాహార లోపం	తీవ్ర పోషకాహార లోపం	అతి తక్కువ బరువు	తక్కువ బరువు
కుమురంభీం	973	46414	4981	3223	210	737	535	3692
ఆదిలాబాద్	1256	58,082	6832	3756	316	1612	903	5105
మంచిర్యాల	969	48,557	4681	3269	200	785	314	2418
నిర్మల్	926	1,257	6070	4329	254	922	430	3055

గోదారమ్మకు పోచమ్మ నగలు

● ప్రారంభమైన గంగనీళ్ల జాతర

సారంగాపూర్, న్యూస్‌టుడే : ఏడాదికోసారి జరిగే 'గంగనీళ్ల' జాతర ఉత్సవాలు శనివారం అడెల్లి మహా పోచమ్మ ఆలయం వద్ద అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు అడెల్లి గ్రామంలోని సేవాదారుల ఇంటి నుంచి ఆభరణాలను ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ ఈవో రమేష్ ఆధ్వర్యంలో బాలాలయంలోని పోచమ్మ తల్లి ఎదుట ఆభరణాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెండి కడవ, ఆభరణాలతో ఆలయ సిబ్బంది, భక్తులు గోదావరికి పాదయాత్రగా పయనమయ్యారు. పోచమ్మ ఆలయం నుంచి మొదలైన పాదయాత్ర దేవిగూడెం, రాయిగనగర్, అడెల్లి, సారంగాపూర్, యాకర్‌పల్లి, వంజర్, ప్యారమూర్ మీదుగా దిలావర్‌పూర్ మండలంలోని మాడెగాం, దిలావర్‌పూర్, బన్సపల్లి, కంజర్ గ్రామాల మీదుగా సాయంత్రానికి సాంగ్వి సమీపంలోని గోదావరి తీరంలోని అక్కడి పోచమ్మ ఆలయానికి చేరుకుంది. రాత్రికి అక్కడే బస చేయనున్నారు. ఆదివారం వేకువజామున అమ్మవారి ఆభరణాలను పవిత్ర గోదావరి నీటితో శుద్ధి చేసి వెండి కడవలో నీటిని తీసుకొని తిరిగి అవే గ్రామాల మీదుగా పాదయాత్రగా సాయంత్రానికి అడెల్లికి రానున్నారు. అడెల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్రలో వేలాది మంది కదం తొక్కుతూ గోదావరికి తరలి వెళ్లారు. గంగనీళ్లకు తరలుతూ.. మనసారా పూజలు.. అంటూ భక్తి గీతాలు పాడుతూ గంగమ్మ చెంతకు పయనమయ్యారు. జిల్లా పోలీసు అధికారి జానకి షర్మిల ఆదేశాలతో డీఎస్పీ ఎ.గంగారెడ్డి పర్యవేక్షణలో నిర్మల్ గ్రామీణ సీఐ రామకృష్ణ, సారంగాపూర్ ఎస్సై ఎస్. శ్రీకాంత్ ఇతర పోలీసు అధికారులతో కలిసి భారీ బందోబస్తు చేపట్టారు. తహసీల్దార్ శ్రీదేవి, ఎస్సై శ్రీకాంత్, ఎంపీడీవో లక్ష్మికాంతరావు, మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ ఆలయ ఛైర్మన్ చందు, కాంగ్రెస్, భాజపా నాయకులు బాలాలయంలోని పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.



ఆభరణాలను ఎత్తుకొని ఆలయం నుంచి పాదయాత్రను ప్రారంభిస్తున్న ఈవో రమేష్



అమ్మవారి ఆభరణాల వెంట పాదయాత్రగా గోదావరికి తరలిన భక్తజనం



ప్రధాన మూర్తిగా నెలకొల్పిన ప్రచండ చండిక విగ్రహం



మాధవేశ్వరి అమ్మవారి నమూనా



మహాకోరేలిని పోలిన ఏకవీర దేవికి ప్రతిరూపంగా..



కశ్మీర్‌లోని సరస్వతి మాతను గుర్తుచేసేలా..

అమ్మవారి శక్తిపీఠాల ప్రదర్శన

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: అమ్మవారి వివిధ రూపాలను ప్రతిబింబించే దేశంలో పలు చోట్ల శక్తిపీఠాలున్నాయి. ఇవి అష్టాదశ శక్తిపీఠాలుగా ప్రసిద్ధి పొందాయి. భక్తులు వీటన్నింటిని ఒకేసారి దర్శించుకోవటం వీలుపడదు. అయితే.. శక్తిపీఠాలను కాపాడుతూ.. అక్కడ కొలువైన అమ్మవారి ప్రతిరూపాలను అన్నింటినీ ఒకేచోట దర్శించుకునేలా.. దేవీ శరన్నవరాత్రుల నేపథ్యంలో ఈ అవకాశం కల్పిస్తోంది. జిల్లాకేంద్రంలోని శ్రీరాజ్యలక్ష్మి పీఠం అచ్చంగా ఈ తరహాతోనే భక్తులను అలరిస్తోంది. స్థానిక బంగల్‌పేట్ శివారులోని రాజశ్యామలాదేవి ఆలయ ప్రాంగణంలో దశసింహ ఉర్వధమైన ప్రచండ చండిక ప్రతిమను నెలకొల్పారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో సుప్రసిద్ధమైన శక్తిపీఠాల్లోని అమ్మవారి ప్రతిరూపాలను ఇక్కడ నెలకొల్పారు. సర్వశ అమ్మవారి చెంత కార్గిని పూజించారు. నవరాత్రులు పూర్తయ్యేవరకు నిత్యం అన్నదానం, కుంకుమపూజ, నవమదుర్గావ చండీహోమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

స్పందించిన మానవతావాదులు

● పసిపాప ఆకలి తీర్చేందుకు విరాళాలు



బేల, న్యూస్‌టుడే: పసిపాప ఆకలి తీర్చేందుకు మానవతావాదులు తమ వంతు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఒక్క రోజులోనే 62 మంది స్పందించి రూ. 24,600 ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. రూ.100 మొదలుకొని రూ.2 వేల వరకు అందజేశారు. బేల మండలం టెంబ్రిగూడకు చెందిన దేశ్‌ముఖ్ మారుతిరావు భార్య ప్రసవమై ఆడపిల్లకు జన్మనిచ్చింది. పుట్టిన 23 రోజులకే తల్లిని కోల్పోయిన పసిపాపను బతికించుకునేందుకు అమ్మమ్మ, తాతమ్మలు పడరాని పాట్లు పడుతున్నారు. మూడు రోజులకొకసారి పాల డబ్బా కొనుగోలు కోసం 6 కి.మీ దూరం కాలినడకన వాగు దాటి వెళ్తూ కష్టాలు పడుతున్నారు. వారి కష్టాలపై 'ఈనాడు'లో 'పసిపాప ఆకలి తీర్చేందుకు 6 కిలోమీటర్ల కాలినడక' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎంతో మంది సాయం చేసేందుకు ముందుకు రావడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. 'ఈనాడు'కు, దాతలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

20 పనులు.. ఉపాధి నిధులు

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పేదలకు ఉపాధి కల్పించేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేసే పనుల గుర్తింపు, కార్మిక బడ్జెట్ తయారు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు క్షేత్ర స్థాయిలో చేపట్టే పనులపై ముమ్మర కసరత్తు చేపట్టారు. -న్యూస్‌టుడే, మంచిర్యాల గ్రామీణం

ఒక్కో పంచాయతీకి 20కి మించకుండా పనులు గుర్తించి వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. పల్లెల్లో ప్రాధాన్యం కలిగిన పనులను గుర్తించి గ్రామసభల ద్వారా ప్రజల ఆమోదం పొందనున్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తించిన పనులకు బడ్జెట్‌ను రూపొందించి కేంద్రానికి పంపిస్తారు. అనంతరం కేంద్రం నుంచి ఆదేశాలు రాగానే వచ్చే ఏప్రిల్ నుంచి వార్షిక ప్రణాళిక కార్మిక బడ్జెట్ ఆధారంగానే ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టనున్నారు.



పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

జిల్లాల వారీగా జాబ్‌కార్డులు, కూలీల వివరాలు..

జిల్లా	మండలాలు	పంచాయతీలు	జాబ్ కార్డులు	కూలీలు
ఆదిలాబాద్	17	468	1,75,747	3,70,082
కుమురంభీం	15	335	1,29,885	2,77,287
నిర్మల్	18	396	1,80,572	3,70,550
మంచిర్యాల	16	311	1,21,067	2,55,151

2025-26 ఉపాధి వార్షిక ప్రణాళిక తయారీ ఇలా

వార్షిక ప్రణాళికపై గ్రామసభల నిర్వహణ : 2 అక్టోబర్ నుంచి 30 నవంబర్ 2024 వరకు

జిల్లా స్థాయి వార్షిక ప్రణాళిక ఆమోదం : 21 జనవరి 2025

రాష్ట్ర స్థాయిలో ఆమోదం : 31 జనవరి 2025

లేబర్ బడ్జెట్ విడుదల : 31 మార్చి 2025

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

2025-26 ఆర్థిక ఏడాదిలో గ్రామాల్లో పేదలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనల ప్రకారమే కార్మిక బడ్జెట్ రూపకల్పన చేసేలా చర్యలు తీసుకుంటాం. నిర్దేశిత లక్ష్యం మేరకు కూలీలకు పనిదినాలు కల్పించి చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసేలా కృషి చేస్తాం. **- కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, మంచిర్యాల**

వార్షిక బడ్జెట్‌లో చర్చించే అంశాలివే..

పల్లెల్లో పేదలకు కనీసం వంద రోజుల పాటు ఉపాధిని కల్పించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం ద్వారా 2025-26 సం.లో 17 కేటగిరీల్లో 266 రకాల పనులు చేయనున్నారు.

- ✷ ప్రధానంగా అసంపూర్తి పనులపై చర్చించాలి.
- ✷ జాబ్ కార్డుల అప్‌డేషన్, పౌర సమాచార బోర్డుల తయారీ, సామాజిక తనిఖీలపై చర్చలు
- ✷ సామాజిక తనిఖీల కోసం స్వయం సహాయక సంఘాల నుంచి ముగ్గురు చురుకైన మహిళలను గ్రామ రిసోర్స్ పర్సన్లుగా నియమించాలి.
- ✷ వ్యవసాయ, సహజ వనరులు, జీవనోపాధుల పెంపు పనులపై చర్చించాలి.
- ✷ ఇంకుడు గుంతలు, కంపోస్టు షెడ్, ఉద్యాన శాఖ, ప్లాంటేషన్ పనులను పర్యవేక్షణ
- ✷ భూగర్భజలాల పెంపుదలను జలదూత్ యాప్‌లో పొందుపర్చాలి.
- ✷ బయోగ్యాస్ ప్లాంట్‌పై, అమృత్ సరోవర్ పథకంపై ప్రత్యేకంగా చర్చించి నిర్ణయం తీసుకుంటారు.



మొదటిస్థానం కైవసం చేసుకున్న ఉమ్మడిజిల్లా హ్యాండ్‌బాల్‌జట్టు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మొదటిస్థానం

మంచిర్యాల క్రీడావిభాగం, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారిణులు సత్తాచాటారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో మెరిశారు. మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య నారాయణపేట జిల్లాలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న 68వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభ చాటి పసిడి పతకాన్ని సాధించారు. శనివారం జరిగిన తుదిపోరులో ప్రత్యర్థి కరీంనగర్ జిల్లా జట్టును 14-5 గోల్స్ తేడాతో ఓడించారు. మెరుగైన ఆటతీరును కనబరిచి క్రీడాకారిణులకు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఫణిరాజా అభినందనలు తెలియజేశారు.

కుస్తీ పోటీల్లో ప్రతిభ

ఆదిలాబాద్ క్రీడావిభాగం: నారాయణపేటలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కుస్తీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్-14, 17, 19 ఏళ్ల విభాగం ఆయా బరువుల కేటగిరీల్లో 4 పసిడి, 2 రజతాలు, 7 కాంస్య పతకాలు సాధించారు. పసిడి పతకం సాధించిన వారిలో పి.నైతిక, సీహెచ్. సహారా, ఎం.స్పందన, డి.శాలిని ఉన్నారు. భువనేశ్వరి, కె.శ్రీజ రజత పతకాలు సాధించారు. ఆర్.అనూష, ఎస్.నందిత, బి.వైష్ణవి, జె.పావని, ఈశ్వరి, కె.శ్రీవల్లి, పి.సహస్ర కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.



రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు

నవోదయలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీగా ఉన్న ఏడు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కొడాలి పార్వతి తెలిపారు. 11వ తరగతిలో ప్రవేశాలకు సైతం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, విద్యాసంవత్సరం ప్రారంభం అనంతరం ఖాళీల వివరాలను వెల్లడిస్తామన్నారు. ఈ నెల 30వ తేదీలోపు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వచ్చే ఏడాది ఫిబ్రవరి 8న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 7తో గడువు ముగియనుందని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.